


# ANDHRA PRADESH
# MOST IMPORTANT
## CURRENT AFFAIRS

**SEPTEMBER (07THSEP -09THSEP)**

# ఎమర్జింగ్ ఐటీ సిటీ విశాఖ

## నాస్కామ్-డెలాయిట్ సర్వేలో ఎంపిక..

## విజయవాడ, తిరుపతికి కూడా జాబితాలో చోటు



- దేశవ్యాప్తంగా 26 నగరాలను ఎంపిక చేసిన నాస్కామ్–డెలాయిట్.. విశాఖలో 8 స్టార్టప్ ఇంక్యుబేటర్స్‌తోపాటు 250కిపైగా ఐటీ కంపెనీలు
- విజయవాడ, తిరుపతిల్లో స్టార్టప్స్‌తో పాటు ప్రధాన విద్యాలయాలు.. ఈ నగరాల్లో నైపుణ్యం గల మానవ వనరుల వ్యయం 30 శాతం తక్కువ
- పెద్ద నగరాలతో పోలిస్తే రియల్ ఎస్టేట్ వ్యయాల్లో 50 శాతం ఆదా.. 60 శాతం మంది పట్టభద్రులు ఈ ద్వితీయశ్రేణి నగరాల నుంచే రాక

- వివరాలు 2లో

# ఎమర్జింగ్ ఐటీ సిటీ విశాఖపట్నం

**నాస్కామ్-డెలాయిట్ సర్వేలో ఎంపిక..**
**విజయవాడ, తిరుపతికి కూడా జాబితాలో చోటు**

**దేశవ్యాప్తంగా 26 నగరాల ఎంపిక**



రాష్ట్రంలో ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించడానికి విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ నగరాలపై అధికంగా దృష్టి సారిస్తున్నట్లు నాస్కామ్–డెలాయిట్ సంయుక్త సర్వే వెల్లడించింది. దేశీయ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలను పెద్ద నగరాలు కంటే చిన్న నగరాలకు విస్తరించడానికి మొగ్గుచూపుతున్నాయని ఈ సర్వే నివేదిక తెలిపింది. ఈ విస్తరణకు ఐదు కీలక అంశాల ఆధారంగా దేశవ్యాప్తంగా 26 ఎమర్జింగ్ ఐటీ హబ్స్‌ను నాస్కామ్–డెలాయిట్ ఎంపిక చేసింది. ఇందులో మన రాష్ట్రం నుంచి విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాలకు చోటు దక్కగా, తెలంగాణ నుంచి వరంగల్ ఎంపికైంది. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మౌలికవసతులు, రిస్క్–వ్యవస్థల నియంత్రణ, స్టార్టప్ ఎకోసిస్టమ్, సోషల్–లివింగ్ ఎన్విరాన్‌మెంట్ అనే అయిదు అంశాలను ప్రాతిపదికగా తీసుకుని వీటిని ఎంపిక చేసినట్లు వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం బీచ్ ఐటీ పేరుతో ఇప్పటికే విశాఖ నగరాన్ని ప్రోత్సహిస్తుండటమే కాకుండా నూతన తరం సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే విధంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు, స్టార్టప్ ఇంక్యుబేటర్స్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. దీంతో ఇన్ఫోసిస్, రాండ్‌శాండ్, బీఈఎల్, అమెజాన్ వంటి ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలను విశాఖకు విస్తరించగా మరి కొన్ని కంపెనీలు త్వరలో కార్యకలాపాలను ప్రారంభించడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నాయి. విశాఖలో మొత్తం 1,120 స్టార్టప్స్ కార్యకలాపాలను సాగిస్తున్నాయి.




వీటిలో 20 శాతానికిపైగా స్టార్టప్స్ టెక్నాలజీ రంగానికి చెందినవే ఉన్నాయి. ఇప్పటికే 250కి పైగా ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు విశాఖ వేదికగా పనిచేస్తున్నాయి. ఇదే సమయంలో విజయవాడలో 80కి పైగా టెక్నాలజీకి చెందిన స్టార్టప్స్ ఉండగా, 550కి పైగా టెక్నాలజీ ఆధారిత వ్యాపారసంస్థలు ఉన్నాయి. అంతేగాకుండా ఏటా 25 వేలమందికి పైగా ఐటీ నిపుణులు అందుబాటులోకి వస్తున్నారు. ఐటీ పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో తిరుపతి ముందువరుసలో ఉంటోంది. తిరుపతిలో ఇప్పటికే 25 టెక్నాలజీ స్టార్టప్స్ కార్యకలాపాలు కొనసాగిస్తుండగా, 50కి పైగా టెక్నాలజీ బేస్డ్ సంస్థలున్నాయి. ఇవన్నీ ఈ మూడు నగరాల్లో పెట్టుబడులను పెట్టే విధంగా ప్రోత్సహిస్తున్నాయి.

- సాక్షి, అమరావతి

### 30% వ్యయం తక్కువ

పెద్ద నగరాలతో పోలిస్తే నైపుణ్యం కలిగిన మానవ వనరులు ద్వితీయశ్రేణి నగరాల్లో లభిస్తుండటం, రియల్ ఎస్టేట్ ధరలూ తక్కువగా ఉండటంతో ఐటీ కంపెనీలు ఈ 26 నగరాల్లో కార్యకలాపాలు మొదలు పెట్టడానికి ప్రధాన కారణమని నాస్కామ్–డెలాయిట్ పేర్కొంది. పెద్ద నగరాలతో పోలిస్తే మానవ వనరుల వ్యయం 25 నుంచి 30 శాతం తగ్గుతున్నట్లు తెలిపింది. దేశీయ ఐటీ నిపుణుల్లో 15 శాతం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి వస్తున్నవారే కావడంతో వారి వద్దకే కార్యాలయాలను తీసుకెళ్లే యోచనలో కంపెనీలున్నాయి. రియల్ ఎస్టేట్ భవనాలు, అద్దెల వంటివీ చిన్న నగరాల్లో తక్కువగా ఉంటున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు ఐటీ కంపెనీలు టైర్–2 సిటీస్ బాట పడుతున్నట్లు ఆ నివేదిక విశ్లేషించింది.

# వర్షం.. రైతుల హర్షం



కోడూరు మండలం విశ్వనాథపల్లిలో నాట్లు వేస్తున్న కూలీలు



పెనుగంచిప్రోలులో సాగులో ఉన్న పత్తి చేను

- మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- తుది దశకు చేరిన ఖరీఫ్ పంటల సాగు
- కృష్ణా జిల్లాలో 80 శాతానికి పైగా సాగైన వరి
- ఎన్టీఆర్ జిల్లాలో ఊపందుకున్న మిరప సాగు
- ముమ్మరంగా సాగుతున్న ఈ-క్రాప్ నమోదు

**సాక్షి ప్రతినిధి, విజయవాడ:** ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు తుది దశకు చేరుతోంది. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు జీవం పోస్తున్నాయి. మరో వైపు ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను లక్ష్యానికి మించి జారీచేస్తున్నారు. కృష్ణా జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,68,459 హెక్టార్లు. ఇప్పటికే 1,35,152 హెక్టార్లలో వరి సాగవుతోంది. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మచిలీపట్నం చివరి ఆయకట్టు మండలాల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. జూలైలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల స్థానంలో వరి సాగుచేస్తున్నారు. పంటలు దెబ్బతిన్న చల్లపల్లి, మొవ్వ, మోపిదేవి, ఘంటసాల, గూడూరు, పెడన, గుడివాడ, నందివాడ, పెదపారుపూడి మండలాల్లో 80 శాతం సబ్సిడీతో 1500 క్వింటాళ్ల వరి విత్తనాలను పంపిణీ చేశారు. సెప్టెంబర్ చివరి నాటికి వరి నాట్లు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

**ఎన్టీఆర్ జిల్లాలో ఇలా..**

జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు సాగులో ఉన్న పంటలకు ఊపిరి పోస్తున్నాయి. జిల్లాలో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 42,604 హెక్టార్లు. రైతులు ఇప్పటికే 31,875 హెక్టార్లలో పత్తి సాగుచేపట్టారు. ఈ ఏడాది జిల్లాలో పత్తి సాగు తగ్గి, మిర్చి సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. 20 వేలకు పైగా హెక్టార్లలో మిరప పంట సాగవుతుందని అధికారులు భావిస్తున్నారు. మిరప సాధారణ సాగు విస్తీర్ణం 14,023 హెక్టార్లు. ఇప్పటికే 11,532 హెక్టార్లలో మిరప సాగు చేస్తున్నారు. గంపలగూడెం, తిరువూరు, పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ, కంచికచర్ల మండలాల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మిర్చి సాగు జోరందుకుంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 50,551 హెక్టార్లు. ఇప్పటి వరకు 40,799 హెక్టార్లలో వరి సాగవుతోంది.

**కౌలు రైతులకు సీసీఆర్సీలు జారీ**

ఉమ్మడి కృష్ణా జిల్లాలో కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు (సీసీఆర్సీ)అందిస్తున్నారు. నిజంగా పంట సాగు చేసే కౌలు రైతులకు లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం వీటిని జారీచేస్తోంది. వీటితో రాయితీపై విత్తనాలు, పంట రుణాలు, సున్నా వడ్డీ రాయితీ, ఇన్పుట్ సబ్సిడీ, రైతుభరోసా, ఉచిత పంటల బీమా, కనీస మద్దతు ధర వంటివి కౌలు రైతులకు వర్తిస్తాయి. కృష్ణా జిల్లాలో సీసీఆర్సీ కార్డుల జారీ లక్ష్యం 52,570. ఇప్పటి వరకు 55 వేలకు పైగా ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో లక్ష్యం 55,895 కాగా, ఇప్పటికి 45 వేలకు పైగా కార్డులు జారీచేశారు. ఈ వర్షాలు పంటలకు ఎంతో మేలు చేస్తున్నాయని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఎస్.పద్మావతి, ఎస్. నాగమణెమ్మ పేర్కొన్నారు. ఈ నెల చివరి నాటికి ఖరీఫ్ పంటల సాగు పూర్తవుతుందని తెలిపారు. రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

## ఈ - క్రాప్ నమోదు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. రైతులు సహకరించి తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇన్పుట్ సబ్సిడీ, ధాన్యం కొనుగోలు, క్రాప్ ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ వంటి పథకాల అమలుకు ఈ-క్రాప్ నమోదు కీలకమని, రైతులు తప్పనిసరిగా తమ పంట నమోదు అయ్యిందో లేదో చూసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. కృష్ణా జిల్లాలో ఇప్పటి వరకు 3,33,634.96 ఎకరాల్లో పంటలు సాగవగా, 1,21,677.41 ఎకరాల్లో అంటే 36 శాతం మేర ఈ-క్రాప్ నమోదు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 3,64,641 ఎకరాల్లో పంటలు సాగవగా, 1,04,858 ఎకరాలు అంటే 29 శాతం మేర ఈ-క్రాప్ నమోదు చేశారు. ఈ ప్రక్రియ ఆగస్టు తొమ్మిదో తేదీ నుంచి ప్రారంభమైంది. ఈ నెల 15వ తేదీ నాటికి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ నెల 30వ తేదీ నాటికి తుది జాబితాలు ప్రచురించనున్నారు.



కృష్ణా జిల్లాలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

# పండుటాకులకు వెలుగురేఖలు



– నా పేరు మండపాటి వెంకటేశ్వరరావు. నా వయస్సు 78 సంవత్సరాలు. మాది కంకిపాడు మండలం కుందేరు గ్రామం. కొద్ది సంవత్సరాల నుంచి చూపు మందగించింది. అక్షరాలు, దూరంగా ఉన్న వారు సరిగా కనిపించేవారు కాదు. మా గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద ఉచిత వైద్యశిబిరం జరుగుతోందని తెలిసి వెళ్లా. డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. ఉచితంగానే కళ్లద్దాలు ఇచ్చారు. ఇప్పుడు నాకు చూపు చాలా బాగుంది.



– నా పేరు గుర్రం వరలక్ష్మి. మాది ఉయ్యూరు. నాకు కంటిచూపు తగ్గింది. కంటి వెలుగు కార్యక్రమం కింద మా గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు జోడు పడుతుందన్నారు. ఎంత ఖర్చు అవుతుందని అడిగా. ప్రభుత్వమే వైద్య పరీక్షలు చేయించి, ఉచితంగానే కళ్లద్దాలను ఇస్తుందని చెప్పారు. చెప్పినట్టే కళ్లజోడు ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడు నా చూపు మెరుగుపడింది. అన్నీ చక్కగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వానికి రుణపడి ఉంటా.

- వృద్ధులు, విద్యార్థులకు వరంలా మారిన వైఎస్సార్ కంటి వెలుగు పథకం
- నేత్ర సమస్యలతో బాధపడుతున్నవారికి ఉచిత వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలు
- 40,165 మంది అవ్వాతాతలకు కళ్లజోళ్లు పంపిణీ
- 10,012 మందికి కంటి శస్త్రచికిత్సలు
- కళ్లజోళ్లు అందుకున్న విద్యార్థుల సంఖ్య 16,086



వృద్ధురాలికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

**పెడన:** మనిషికి కళ్లు ముఖ్యమైనవి. చూపు మందగిస్తే అడుగు ముందుకు పడదు. వృద్ధాప్యంలో కంటిచూపు మందగించడం సాధారణం. విద్యార్థుల్లో అయితే చదువుకు ఆటంకం కలుగుతుంది. భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. అవ్వాతాతలు, విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద నాలుగేళ్లుగా ఊరురా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీచేస్తోంది. వృద్ధులకు నేత్ర శస్త్రచికిత్సలను చేయించి వారికి వెలుగు దారి చూపుతోంది.

**నాటి నుంచి నేటి వరకు...**

- డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా తొలివిడతలో 2019 అక్టోబర్ పది నుంచి 18వ తేదీ వరకు జిల్లాలోని 4,373 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 5,70,510 మంది విద్యార్థులకు ఏఎన్ఎంలు కంటి వైద్య పరీక్షలు చేశారు. 44,125 మందికి కంటి సమస్యలు ఉన్నాయని గుర్తించారు.
- 2019 నవంబర్ ఒకటి తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు రెండు నెలలు పాటు రెండో విడత వైద్య పరీక్షలు చేశారు. తొలి విడతలు కంటి సమస్యలు ఉన్నాయని గుర్తించిన వారిలో 44,006 మందికి నేత్ర వైద్యులు కంటి పరీక్షలు చేశారు. 27,457 మందికి నేత్ర సమస్యలు లేవని తేల్చారు. 16,086 మందికి కళ్లద్దాలు అందజేశారు. మరో 317 మందికి ఆపరేషన్లు అవసరమని తేల్చారు. వారిలో 19 మంది శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. మరో 146 మంది విద్యార్థులకు మందులు వాడితే సమస్య పరిష్కారమవుతుందని వైద్యులు సూచించారు.
- మూడో విడత కంటి వెలుగు కార్యక్రమం 2020 ఫిబ్రవరి 18వ తేదీ నుంచి ప్రారంభమైంది. కోవిడ్ కారణంగా కొంత కాలం కంటి పరీక్షలను నిలిపివేశారు. 2021 మే 27 నుంచి కంటి పరీక్షలు పునఃప్రారంభించి నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. మూడో విడతలో 60 ఏళ్ల పైబడిన 2,12,697 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు 1,75,840 మందికి పరీక్షలు చేశారు. 40,165 మందికి కళ్లద్దాలను అందజేశారు. 36,857 మందికి రెండో సారి పరీక్షలు నిర్వహించి 10,012 మందికి శస్త్రచికిత్సలు చేశారు.

### జీవితంలో సరికొత్త వెలుగులు



విద్యార్థులకు రెండు విడతల్లో కంటి వైద్య పరీక్షలు చేశాం. మూడో విడత అవ్వాతాతాలకు పరీక్షలు చేస్తున్నాం. అవసరమైన వారికి మచిలీపట్నం, గుడివాడ ప్రభుత్వాస్పత్రులతో పాటు తాడిగడప ఎల్వీ ప్రసాద్, ఉయ్యూరు సీబీఎం, రోటరీ, బొమ్ములూరు లయన్స్, నూజివీడు గిఫ్ఫోర్డ్ ఆస్పత్రుల్లో అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాం. నిర్దేశించిన లక్ష్యంలో కంటి సమస్యలున్న వారు ఇంకా 36,857 మంది ఉన్నారు. వారిని ప్రస్తుతం పరీక్షిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థులు, అవ్వతాతల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

– డాక్టర్ బి.నాగజ్యోతి, కృష్ణా జిల్లా ప్రోగ్రాం అధికారి, కంటి వెలుగు, మచిలీపట్నం

## వైఎస్సార్ కంటి వెలుగు

వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా తొలి రెండు విడతల్లో పాఠశాలల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. కొంత మందికి శస్త్రచికిత్సలు కూడా చేశారు. ప్రస్తుతం మూడో విడత సాగుతోంది. ఈ విడతలో అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేస్తున్నారు. వైద్య పరీక్షల కోసం అవ్వాతాతలు ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఊరిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే జిల్లా కేంద్ర ఆస్పత్రి, ఇతర ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయిస్తోంది.

# జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్య సహాయం

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఎన్టీఆర్ జిల్లాలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేయడంతోపాటు, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష పథకంపై ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్య, అదనపు కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.డి.కృష్ణబాబు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ సీఈఓ ఎం.ఎస్.హరీంద్ర ప్రసాద్ ప్రధాన కార్యాలయం నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఢిల్లీరావు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నెల పాటు జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు హెల్త్ క్యాంపులు నిర్వహిస్తారని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటిని సందర్శించి ప్రతి ఒక్కరికీ ప్రాథమిక వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఆ సమయంలో గుర్తించిన ప్రజల అనారోగ్య సమస్యలను ప్రత్యేక కేసు షీట్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అక్టోబర్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించి, గుర్తించిన వారికి వైద్య సహాయం అందజేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రి వైద్యులతోపాటు ఆరోగ్య శ్రీ రిఫరల్ ఆస్పత్రులు, కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యులు కాంపుల్లో ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తారని వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి, మెరుగైన వైద్య చికిత్స కావాల్సిన వారిని ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసి పూర్తిగా కోలుకుని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జగనన్న సురక్షను విజయవంతం చేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ జె.సుమన్, అడిషనల్ డీఎంహెచ్ఓ జె.ఉషారాణి, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ర గాంధీ పాల్గొన్నారు.

# ప్రజలందరికీ..
# ‘ఆరోగ్య సురక్ష

- మరో విప్లవాత్మక కార్యక్రమం చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- ‘జగనన్న ఆరోగ్య సురక్ష’తో మరింత మెరుగైన వైద్యం
- ఈ నెల 15 నుంచి ఇంటింటికి వెళ్లి వలంటీర్ల ప్రచారం
- 16 నుంచి ఏఎన్ఎంలు, సీహెచ్ఓల ఆరోగ్య సర్వే
- పరీక్షల ద్వారా ఆరోగ్య సమస్యలు గుర్తించనున్న సిబ్బంది
- 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు.. నెల పాటు నిర్వహణ
- సేవలందించనున్న స్పెషలిస్ట్ డాక్టర్లు, పీహెచ్‌సీ వైద్యులు, ఇతర సిబ్బంది
- ఉచితంగా చికిత్స, మందులు.. అవసరమైతే పెద్దాస్పత్రులకు రిఫర్







FOLLOW US ON SOCIAL MEDIA

Telegram Whatsapp Instagram Youtube